
ఆశలు ఆవిరి!



విజయనగరం: పింఛన్ తీసుకోవడానికి అర్హత ఉన్నా చాలా మందికి మంజూరు కావడం లేదు. కొత్తగా మంజూరు కాక నెలలుగా నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వం కూడా కొత్త లబ్ధిదారులను ఎంపిక చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికలకు ముందు నుంచి కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియ నిలిచిపోయింది. 50 ఏళ్లు నిండిన వారందరికీ పింఛన్లు మంజూరు చేస్తామని ప్రకటించటంతో అందరిలో ఆశలు రేకెత్తాయి. అయితే కూటమి ప్రభుత్వంలో కూడా లబ్ధిదారులు ఎవరైనా మృతి చెందితే వారి సంబంధీకులకు మాత్రమే సదరు పింఛన్లు మంజూరు చేస్తున్నారు తప్ప అర్హత ఉన్నప్పటికీ అదనంగా ఇవ్వడం లేదు. దీంతో లబ్ధిదారుల ఆశలు ఆవిరిగా మారుతున్నాయి. ఎన్నికల హామీలో భాగంగా కూటమి ప్రభుత్వం వచ్చాక పింఛన్ నగదు పెంచినప్పటికీ ఇప్పటికే పింఛన్ మంజూరైన లబ్ధిదారులకు మాత్రమే వర్తిస్తోంది. అయితే నూతనంగా అర్హత సాధించిన వారు వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలు కొత్త పింఛన్లు మంజూరు కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. దివ్యాంగ లబ్ధిదారులకై ఏకంగా రూ.ఆరు వేలు, మంచానికే పరిమితమైన లబ్ధిదారులు, డయాలసిస్ రోగులకు రూ.15 వేల వరకు ప్రభుత్వం పింఛన్ల రూపంలో నగదు పెంచినట్లు ఆర్భాటం చేసిన కూటమి సర్కారు వారిలో అనర్హులు ఉన్నారంటూ మరల వారంతా వైద్యులు వద్దకు వెళ్లి ధ్రువీకరణ పత్రం తీసుకోవాలంటూ నోటీసులు జారీ చేస్తుండటం గమనార్హం. దీంతో కొత్త పింఛన్ల మాట అలా ఉంచితే పాత పింఛన్ల తొలగింపులో అధికారులు నిమగ్నమవటం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా కొత్త వారికి పింఛన్లు మంజూరు చేయకపోవటంపై అర్హులైన వారంతా ప్రభుత్వం తీరుపై మండిపడుతున్నారు.

లబ్ధిదారులకు తప్పని ఎదురుచూపులు

కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రకటించిన హామీలపై ఆశపడి ఓట్లేసిన అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందన్న అపవాదు సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇందులో భాగంగా పింఛన్లు మంజూరుపై అర్హులైన వారంతా ప్రభుత్వం తీరుపై అసంతృప్తితో ఉన్నారు. ఇప్పటి వరకు కొత్త పింఛన్ లబ్ధిదారుల ఎంపిక చేపట్టకపోవటమే ఇందుకు ప్రధాన కారణం. విజయనగరం నియోజకవర్గంలో సుమారు వెయ్యి మంది వరకు అభ్యర్థులు కొత్త పింఛన్‌ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే సంబంధిత వివరాల నమోదుకు వెబ్‌సైట్‌ను ప్రభుత్వం ప్రారంభించలేదు. దీంతో వారందరూ పింఛన్లు ఎప్పుడు మంజూరవుతాయోనని ఎదురు చూస్తున్నారు. కార్పొరేషన్, మండల పరిషత్, సచివాలయ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసే పరిస్థితి దాపురించింది. నిత్యావసర ధరలు పెరిగిన నేపథ్యంలో పింఛను నగదు ఉంటే కాస్తయినా ఆసరాగా ఉంటుందని భావిస్తున్నారు. బాధితుల మొర ఆలకించి ప్రభుత్వం అర్హులైన వారికి కొత్తగా పింఛన్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

వెబ్‌సైట్ ఓపెన్ కావాల్సి ఉంది

నూతనంగా పింఛన్లు మంజూరు కోసం ప్రభుత్వం నిర్వహించే వెబ్‌సైట్ ఓపెన్ కావాల్సి ఉంది. ఇప్పటి వరకు కార్పొరేషన్ పరిధిలో ఎటువంటి పింఛన్లు తొలగించలేదు. వారి అర్హతలను మరోసారి ధ్రువీకరించుకోవాలని ప్రభుత్వ ఆదేశాలను నోటీసుల రూపంలో అందజేస్తున్నాం. వెబ్‌సైట్ ప్రారంభం కాగానే నూతన పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకునేందుకు వీలుంటుంది.

– సింహాచలం, టీపీఆర్వో, విజయనగరం కార్పొరేషన్

క్లుప్తంగా

పైడితల్లి అమ్మవారి చండీయాగం



చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు చండీయాగం స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి, మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడి ఆవరణలో శుక్రవారం పౌర్ణమి పురస్కరించుకుని ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు దూసి శివప్రసాద్, తాతా రాజేష్, వెలువలపల్లి నరసింహమూర్తిలు శాస్త్రోక్తంగా యాగప్రక్రియ నిర్వహించారు. అనంతరం యాగ విశిష్టతను భక్తులకు వివరించారు. అమ్మవారి శేషవస్త్రాలను, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ఇన్‌చార్జి ఈఓ కెఎన్‌విడివి.ప్రసాద్ పర్యవేక్షించారు.

ముగిసిన శిక్షణ



శిక్షణ పొందిన అభ్యర్థులతో ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ నోడల్ అధికారి సుబ్రహ్మణ్యం

విజయనగరం అర్బన్: జీఎంఆర్ ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌కే టౌన్‌షిప్‌లో మూడు నెలలుగా మోటారు వైండింగ్‌పై ఉచితంగా అందించిన శిక్షణ శుక్రవారంతో ముగిసింది. ముగింపు సభకు ముఖ్యఅతిథిగా హాజరయిన ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ నోడల్ అధికారి డి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలతో ఉపాధి కల్పనకు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం శిక్షణ ధ్రువపత్రాలను, జీఎంఆర్ సంస్థ ఉచితంగా ఇచ్చిన ఎలక్ట్రికల్ టూల్ కిట్లను ముఖ్యఅతిథి అందజేశారు. కార్యక్రమంలో జీఎంఆర్ సంస్థ మేనేజర్ సీహెచ్ నాగరాజు, సెంటర్ ఇన్‌చార్జ్ కనకం వెంకటరమణ పాల్గొన్నారు.

నేడు యథావిధిగా తాగునీటి సరఫరా



మధుపాడ వాటర్ రిజర్వాయర్ వద్ద ట్రైల్ రన్ వేసిన సిబ్బంది

విజయనగరం: మధుపాడ వాటర్ రిజర్వాయర్ నుంచి విజయనగరానికి నీటి పంపిణీ జరపాల్సిన 750 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనులు పూర్తి కావడంతో తాగునీటి సరఫరాను యథాతథం చేస్తున్నట్లు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. గురువారం అర్ధరాత్రి ఒంటి గంట వరకు మరమ్మతు పనులు చేపట్టినట్లు తెలిపారు. ట్రైల్ రన్ పూర్తి కావడంతో నీటి పంపిణీ చేపడుతున్నట్లు చెప్పారు. శనివారం నుండి యథావిధిగా తాగునీటి పంపిణీ జరుగుతుందని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా తమ్మునాయుడు



పిన్నింటి తమ్మునాయుడు

డెంకాడ: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడును పార్టీ నియమించింది. చింతలవలస ఎంపీటీసీ సభ్యుడిగా ఉన్న తమ్మునాయుడు ప్రస్తుతం మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా పని చేస్తున్నారు. అంతకు ముందు చింతలవలస సర్పంచ్‌గా కూడా పని చేశారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా..

- నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు



చిక్కాల సాంబశివరావు

నెల్లిమర్ల: పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు తెలిపారు. శుక్రవారం ఆయన తన నివాసంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు మరింత చేరువగా సేవలు అందిస్తామని పేర్కొన్నారు. నెల్లిమర్ల నగర పంచాయతీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా చిక్కాల సాంబశివరావుకు మళ్లీ అవకాశం దక్కింది. చిక్కాల ప్రస్తుతం నగర పంచాయతీ కౌన్సిల్‌లో కోఆప్షన్ సభ్యుడుగా ఉన్నారు. ఆయనను వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, కౌన్సిలర్లు చిక్కాల సంతోష్ కుమార్, చిక్కాల సుమతి, బూర సుజాత తదితరులు అభినందించారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాలపై కొరడా



మార్కెట్‌లో ప్లాస్టిక్ వాడకాలపై ఆకస్మిక దాడులు చేసిన నగరపాలక సిబ్బంది

విజయనగరం: ప్లాస్టిక్ నియంత్రణా చర్యల్లో భాగంగా శుక్రవారం పట్టణంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులతో కలిసి నగరంలో మార్కెట్ ప్రాంతంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాలపై శుక్రవారం దృష్టి సారించారు. టిఫిన్ దుకాణాలు, కిరాణా దుకాణాలు, ఇతర దుకాణాల వద్ద సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తున్నారా.. లేదా.. అని క్షేత్ర స్థాయిలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. కొంతమంది సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించడంతో అట్టి సామగ్రిని స్వాధీనం చేసుకొని అపరాధ రుసుం విధించారు. పర్యావరణ హితాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణగా ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు పరచాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల అనేక అనర్థాలు భవిష్యత్తులో కలుగుతాయన్నారు. కావున ఏ ఒక్కరు సింగిల్ యూజ్ ప్లాస్టిక్, అలాగే నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను విక్రయించడంగానీ వినియోగించడంగానీ చేయరాదన్నారు.

పన్ను బకాయి వసూళ్లలో కమిషనర్



పన్ను బకాయిలు వసూలు చేస్తున్న నగర పాలక సంస్థ సిబ్బంది

విజయనగరం: దీర్ఘకాల పన్ను బకాయిలను విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది అధిక మొత్తంలో రాబడుతున్నారు. ఆయనే స్వయంగా రంగంలోకి దిగి పన్ను బకాయిలను వసూలు చేస్తున్నారు. సచివాలయాల పరిధిలో రెవెన్యూ సిబ్బంది, అడ్మిన్ కార్యదర్శులు చేపడుతున్న పన్ను వసూళ్ల ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారు. సహాయ కమిషనర్ కె.అప్పలరాజు నేతృత్వంలో రెవెన్యూ సిబ్బంది శుక్రవారం కూడా వివిధ ప్రాంతాలలో మొండి బకాయిదారులు వద్దకు వెళ్లి తక్షణమే పన్ను చెల్లించాలని పట్టుబట్టారు. దీంతో చాలామంది పన్నులను చెల్లించారు. కొంతమంది నగదు రూపంలో, మరి కొందరు చెక్కులు రూపేనా చెల్లించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ప్రజలు తమ యొక్క ఆస్తి పన్నులు, ఖాళీ స్థలముల పన్నులు, నీటి చార్జీలను వెంటనే చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని అన్నారు. శతశాతం పన్ను వసూలే లక్ష్యంగా తాము కృషి చేస్తున్నామన్నారు. ఇందుకోసం సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పన్నులు చెల్లించని వారు వడ్డీ భారం కూడా భరించాల్సి వస్తుందన్నారు. ప్రజలు చెల్లించిన పన్నులతోనే నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ఉచిత బస్సు

శృంగవరపుకోట: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఎస్.కోట ఆర్టీసీ బస్ డిపో మేనేజర్ కె.రమేష్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పరీక్షలకు వెళ్లే వారంతా తమ హాల్ టికెట్ చూపించి, బస్సు టికెట్ తీయకుండా ప్రయాణం చేయవచ్చన్నారు. పరీక్షలు ముగిసేంత వరకు ఈ సదుపాయం అందుబాటులో ఉంటుందన్నారు.

కూరగాయల సాగుపై రైతుల ఆసక్తి



శ్రీరంగరాజపురంలో రైతులు సాగు చేస్తున్న వంగ తోట

గజపతినగరం: కూరగాయల సాగుపై రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. ఖరీఫ్ వరి సాగుకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందివ్వకపోవడంతో పాటు పెట్టుబడి కూడా భారీగా అవుతుండడంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు, ఆదాయం వచ్చే మార్గాలను అన్నదాతలు అన్వేషిస్తున్నారు. దీనిలో భాగంగానే కూరగాయల సాగును ఆశ్రయిస్తున్నారు. చేతికి వచ్చిన పంటను మార్కెట్‌లో విక్రయించి అనుకున్న లాభం పొందుతున్నారు. మండలంలోని మరుపల్లి, మదుపాడ, కాలంరాజుపేట, శ్రీరంగరాజపురం, ఎం.గుమడాం తదితర గ్రామాల్లో వంగ, బెండ, మిరప, దొండ, చిక్కుడు, ఆనప, క్యాబేజి తదితర కూరగాయ పంటలను రైతులు సాగు చేస్తున్నారు.

తల్లిదండ్రులకు పాదపూజ



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న పిల్లలు

శృంగవరపుకోట: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో మహా అవతార్ బాబాజీ ధ్యానమందిరం గురువులు శ్రీరామ్‌బాబాజీ, లక్ష్మి మాతాజీల నేతృత్వంలో పలువురు తమ తల్లిదండ్రులకు పాదపూజ శుక్రవారం చేశారు. అనంతరం ఆయా గురువులు మాట్లాడుతూ మాతా పితలను మించిన దైవం లేదని, తల్లిదండ్రులే ప్రత్యక్షంగా కనిపించే దైవాలన్నారు. తల్లిదండ్రుల ఆశీర్వాదం పిల్లలకు అవసరమని, వారి ఆశీస్సులు ఉంటే ఆయుష్షు, ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం, విజయం సిద్ధిస్తాయన్నారు. ప్రతిఒక్కరూ తమ తల్లిదండ్రులను గౌరవించాలని కోరారు. కార్యక్రమంలోవాసవీ వనితా క్లబ్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మానసాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలందుకున్న మానసాదేవి నాగశక్తి అమ్మవారు

చీపురుపల్లి: మండలంలోని రామలింగాపురం-పుర్రేయవలస గ్రామాల మధ్యన ఉన్న మానసాదేవి నాగశక్తి అమ్మవారి ఆలయంలో భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పిన్నింటి రమణ తెల్లవారుఝామున 3 గంటల నుంచి అమ్మవారిని అలంకరించి ఉదయం 5 గంటలకు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

గదబవలసలో ఆర్డీవో పర్యటన



గదబవలస గ్రామంలో పర్యటిస్తున్న ఆర్డీవో కీర్తి

వేపాడ: మండలంలోని గదబవలస గిరిజన గ్రామంలో విజయనగరం ఆర్డీవో దాట్ల కీర్తి శుక్రవారం సాయంత్రం పర్యటించారు. అక్కడి గిరిజనుల భూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నో ఏళ్లగా తాము సాగు చేస్తున్న ఇనాం, ప్రభుత్వ భూములకు సంబంధించి, ఎటువంటి పట్టాలు అందివ్వకపోవడంతో ప్రభుత్వ పథకాలు, ప్రోత్సాహకాలు, రాయితీలు పొందలేకపోతున్నామని గిరిజనులు వాపోయారు. ఆయా భూములకు సంబంధించి, సర్వే చేసి నివేదిక సమర్పించాలని తహసీల్దారు రాములమ్మను ఆర్డీవో ఆదేశించారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దారు సన్యాసినాయుడు, వీఆర్వో, సర్వేయరు తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో అష్టలక్ష్మీ పూజలు



విజయనగరంలోని రింగురోడ్డు టౌన్ సెంటర్ లేఅవుట్‌లో కొలువైన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో అష్టలక్ష్మీ పూజలను భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. శ్రీ శ్రీనివాసా సేవా సంఘం సౌజన్యంలో ఇంటింటా మహాలక్ష్మి పూజ అనే సంకల్పంతో 108 శుక్రవారాలు భక్తుల గృహాల్లో లక్ష్మీదేవి పూజ, విష్ణు సహస్రనామ స్తోత్రపారాయణం, లక్ష్మీ పారాయణం వంటి విశేష కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఆలయ అర్చకులు శ్రీమన్నారాయాణచార్యులు, రఘునాథాచార్యుల పర్యవేక్షణలో పూజాధికాలు నిర్వహించారు.

– విజయనగరం టౌన్

రామతీర్థంలో వైభవంగా కల్యాణోత్సవాలు



భాస్కర పుష్కరిణి వద్ద సుదర్శన పెరుమాళ్లకు చక్రస్నానం చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో ఉపాలయాల్లో కొలువుదీరిన మాధవస్వామి, భూ భుజంగ వరాహలక్ష్మి నరసింహస్వామి వారి కల్యాణ మహోత్సవాలు గడిచిన ఐదు రోజుల నుంచి వైభవంగా కొనసాగుతున్నాయి.

స్వామి వారి ఉత్సవాల్లో భాగంగా అర్చకులు శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు జరిపించారు. యాగశాలలో పూర్ణాహుతి జరిపించిన తరువాత సుదర్శన స్వామి వారిని పల్లకిలో ఊరేగింపుగా భాస్కర పుష్కరిణి వద్దకు తీసుకువెళ్లి చక్రస్నానం చేయించారు. అనంతరం ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు జరిపించారు.

కనుల పండువగా డోలోత్సవం

పాల్గుణ మాసం పౌర్ణమిని పురస్కరించుకొని డోలోత్సవాన్ని అర్చకులు కనుల పండువగా జరిపించారు. శ్రీ రామచంద్రస్వామి వారిని పల్లకిలో గ్రామ తిరువీధిలో ఊరేగింపుగా నీలాచలం పర్వతం మెట్ల మార్గం వద్ద ఉన్న డోలా మండపం వద్దకు తీసుకువెళ్లారు. అనంతరం స్వామిని ప్రత్యేక ఊయలలో వేంచేపుజేసి విశేష అర్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరిసింహాచార్యులు, పవన్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

జ్యూట్ మిల్లు వెంటనే తెరవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

నెల్లిమర్ల: జ్యూట్ మిల్ వెంటనే తిప్పి కార్మికులకు ఉపాధి కల్పించాలని జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక మొయిద జంక్షన్, జరజాపుపేట గ్రామాల్లో కార్మికులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లు తిప్పడానికి జ్యూట్ యాజమాన్యం మెయింటైన్ (నిర్వహణ)పేరిట కాలయాపన చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా జాయింట్ లేబర్ కమిషనర్ వద్ద జ్యూట్ యాజమాన్యం, కార్మిక సంఘాలు చర్చల్లో మిల్లు తిప్పడానికి యాజమాన్యం అంగీకరించి ఈ నెల 3నుంచి మిల్ నిర్వహణ పనులు ప్రారంభించి రెండు వారాలు గడుస్తున్నా మిల్ తిరగడం లేదన్నారు. మిల్లు సమస్యపై కార్మిక శాఖ అధికారి, స్థానిక ఎమ్మెల్యేకు చెప్పినా ప్రయోజనం కనిపించడం లేదన్నారు. ఇప్పటికే మిల్లు మూతబడి 9నెలలకు పైగా గడిచిందని దీని వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మిల్లు తిప్పించే బాధ్యత ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు లేదా అని ప్రశ్నించారు. సమావేశంలో కార్మికులు కె.పద్మనాభం, ఎస్.అప్పారావు, ఎం.కృష్ణ, బి.రామకృష్ణ, సాధు బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన



విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

పూసపాటిరేగ : నిరుపేదలను నిలువునా ముంచుతున్న కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని సీపీఎం నాయకుడు బి. సూర్యనారాయణ అన్నారు. మండలంలోని కొవ్వాడ గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీలు పెంపుపై ప్రజాచైతన్య యాత్ర శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొవ్వాడ గ్రామంలో దళిత కాలనీలో రూ.7 వేల నుండి 50 వేల వరకు విద్యుత్ చార్జీలు చెల్లించమని విద్యుత్‌శాఖ అధికారులు డిమాండు చేస్తున్నారని తెలిపారు. విద్యుత్ బిల్లులు చెల్లించకపోతే విద్యుత్ కనెక్షన్ తొలిగిస్తామని భయపెడుతున్నారని ధ్వజమెత్తారు. 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం నేడు మోసం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు దేబార్కి అప్పారావు, బడి నర్సయ్య, సిమ్మల నాగరాజుతో పాటు పలువురు సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.